# సంధ్యా సమయం

-ఐతా చంద్రయ్య

"కమలా! క్కొ... కొంచెం మంచినీళ్లియ్యమ్మా!"

బతుకు బాటలో ఢక్కామొక్కీలు తిని కుక్కి మంచానికి పరిమితమైన శ్రీనివాసు అలా దేవిరించడమిది నాలుగో సారి. మొదటిసారి కోడలు కమల వినిపించుకోలేదు. రెండోసారి వినబడినా వినబడనట్టే గాల్లో కలిసిపోయింది. మూడోసారి కమల స్పందించింది గాని మనవడి చెవి మీద పేను పారినట్టు గూడా కాలేదు.

సాయంత్రం ఐపోయింది. సంధ్యా సమయం కాలేదింకా కాని తనకది జీవన సంధ్యా సమయమని శ్రీనివాసుకు తెలుసు. పాత పెంకుటిల్లు ముందు కొమ్మలు రెమ్మలుగా విస్తరించిన పొడగాటి వేప చెట్టు. చెట్టు కింద నవారు మంచము. అతని బతుకులాగే దానికెన్నో విడదీయరాని ముడులున్నాయి. కోర వయసులో దొర వయసు భార్య కోరిక మేరకు కొన్న మంచమది... ముసలి మంచము.



"అరేయ్ బాలరాజూ! తాతకు జెరన్ని నీళ్లియ్యిరా!" కమల కొడుక్కు పురమాయించడమిది రెండోసారి.

"నీ యవ్వ! గా ముసలోడు గట్లనే వొర్రుతడు. నేను రాసుకోవాలె పో!" సూర్యాస్తమయ సమయాన వెలుగురేఖల్ని వెతుక్కుంటూ హోంవర్కు చేసుకొంటున్న బాలరాజుకు విసుగొచ్చింది.

"అప్పుడు మారాజు లెక్క బతికితి. ఇప్పుడు మాయదారి రోజులొచ్చె... గొణుకున్నాడు శ్రీనివాసు. మరోసారి కోడల్ను కేకెయ్యాలనుకుంటే దగ్గుతెర కుదరనివ్వలేదు.

ఎండాకాలం... పొద్దంతా వసారా నేలమీద, సాయంత్రం నుండి మర్నాడు ఎండముదిరే దాకా అతని ఆలనాపాలనా వేప చెట్టు నీడలో, మంచం ఒడిలోనే.

టేకు వనంలో వాన వెలిసినట్టు- దగ్గు తెరిపినిచ్చింది. మనవడు నీళ్లు తేలేదు. కోడలు కనబడలేదు. కొడుకు జాడ లేదు. నాలిక పీక్కుపోతుంది, గొంతు తడారి పోతుంది.

"కమలా! గంగాధర్ బడి నుంచి వచ్చెగదా! ఎటువోయిండూ?" కొడుకు గురించి అడుగుతూంటే గొంతు కోపం రంగరించుకుంది. వేలెడు గ్లాసు నీళ్లతో వంటింట్లోంచి గబగబా వచ్చింది కమల. దబుక్కున నీళ్ల గ్లాసు చేతికందిస్తూ,

"నీ కొడుక్కేమన్నా ఆఫీసరుజ్జోగమిప్పించినవా? బోడి అటెండరుజ్జోగం. పొట్టకొస్తే బట్టకు రాదు, బట్టలు కొంటే పొట్టకు సరిపోదు. ఉన్నొక్క కొడుకును ఊరూర దింపుకుంట వేషాలేయిస్తివి. చదువు సంకనాకి పాయె. ఇంకా నయం చిందు మాదిగ కులమని గీనౌకరన్నా దొరికింది". మూతి మూడు వంకర్లు తిరుగుతూంటే చేతులు నాలుగు వంకర్లు తిరిగినై. ఒలికిపోగా మిగిలిన నీళ్లను గటగటా తాగేశాడు. గొంతు శాంతించింది.

"అదంతా నా ఖర్మ, దాని ఖర్మ" నెత్తికొట్టుకున్నాడు. "ఇంతకూ వాడేడీ?"

"హెడ్మాస్టరు సారెందుకో రమ్మన్నడటా. ఆగమాగాన జెరంత చాయ నోట్ల వోసుకుని ఉరికిపోయిండు" ఖాళీ గ్లాసుతో గిరుక్కున వెనుదిరిగింది. "గుర్రం గుడ్డిదైతే దాణా తక్కువ తింటుందా అన్నట్టు- బుడ్డపైస సంపాదన లేకున్నా ఆకలి దూపకేమాత్రం తక్కువ లేదు." దీర్ఘాలు దీస్తూ వెల్తున్న కోడలి వైపు చూస్తుంటే శ్రీనివాసు కళ్ల హృదయంలో కడలి తరంగాలెగిసి పడినై.

ఎట్లా బతికినోణ్ని, ఎట్లా ఐపోతి?

ఆ రోజుల్ల చిందు బాగోత మంటే జనాలు పోటీల మీద ఉరికొచ్చి పూటల తరబడి కూచుని చూసి ఆనందించిరి. సురభి నాటక కంపెనీలొచ్చి చిందు బాగోతాలకు చెంప దెబ్బ పెట్టినై. సినిమాలొచ్చి చావుదెబ్బ దీసినై. టీ.వీ.లొచ్చి కోలుకోకుండ జేసినై. అంతర్మథనం గతాన్ని నెమరుకు తెస్తోంది..."

"........

రామచంద్రుడనురా

రాజీవ నేత్రుడను, శ్యామల గాత్రుడ

రామచంద్రుడనురా..." ఉల్లాసంగా, ఉత్సాహంగా తాను గొంతెత్తి పాడుతూ శ్రీరాముని వేషంలో నటిస్తూంటే జనాలు ముగ్ధులై చూసేవారు. శ్రీకృష్ణుని వేషంలో సత్యభామతో సరసాలాడుతూంటే యువతుల చెంపల మీద సిగ్గులు కెంపుల్లా కనబడేవి. అర్జునుడిగా మత్స్య యంత్రం పడుగొడ్తుంటే ధార్మిక లోకం దంగైపోయేది. 'సత్యహరిశ్చంద్ర' యక్షగాన బాగోతములో హరిశ్చంద్రుడై కాటికాపలాదారుగా కన్నకొడుకు శవానికి సుంకం చెల్లించుమని పాత్రలో లీనమై నటిస్తుంటే మనసున్న మనుషులంతా కన్నీటి సముద్రమై పోయేవారు. ఇహ శివుని వేషములో నటరాజుగా పలు నాట్య భంగిమలు చూపిస్తూ... తై తై, తై తై, తై తై, తైతైతై

తయ్యకతత్తా, తయ్యకతత్తా

తైతైతై..." అంటూ తాను చిందులు తొక్కుతూంటే బుడ్డన్‌ఖాన్ (విచిత్ర వేషం) చిత్ర విచిత్రంగా గంతులేస్తూ, కాళ్లూ చేతులు వంకర టింకరగా తిప్పుతూ

"తయ్యక తత్తా, పోసానత్తా

గట్కుమాడిపాయె గౌరత్తా

తిందువు లెవ్వూ మల్లత్తా..." పాడేవాడు. ఆ దృశ్యం ప్రేక్షక లోకాన్ని కడుపుబ్బ నవ్వించేది.

విశ్వామిత్రుడు శాపం పెడతానని బెదిరిస్తే సేవకునిగా బుడ్డన్‌ఖాన్ దోసిలి బట్టి, లొట్టలేస్తూ.

"శాపలా సామీ! పెట్టు, శారెడన్ని వెట్టు, వారెవ్వా! శాపల పులుసు చాలా బాగుంటది" అంటూ పెదాలు నాక్కునేవాడు. "ఇంతకూ అవి ఎండిన శాపలా, పచ్చి శాపలా? కొర్రమట్టలా, రొయ్యలా? రొయ్యల పులుసు రుచంటే... అమృతం సామీ!"నని ఊరిస్తూ విశ్వామిత్రునితో తిట్లు తినేవాడు. ఇలాంటివెన్నో ఘట్టాలు నవరసాలొలికిస్తూ సామాన్యులను, అసామాన్యులను అలరించేవి, పొట్ట చెక్కలయేలా నవ్వించేవి.

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలనేవారు. గ్రామ సీమల్లో వృత్తిపనుల వారు, వ్యవసాయదారులు చెమటోడ్చి పంజేసేవారు. చిందు బాగవతాన్ని చూస్తూ కష్టాలను మరిచి వానసికానందములో మునిగి తేలేవారు. ఆ చిందానందమే ఔషధంగా పంజేసి అలసిసొలసిన శరీరాలకు కొత్త శక్తినిచ్చేది.

దొరలు- షావుకార్లు ఉదారంగా, కష్టజీవులు చేతనైనంత చిందు కళాకారులకు దానం చేసేవారు. ఆ దానముతో తమ జీవితమనే బండి ఒడుదుడుకులు లేకుండా నడిచేది. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర... ఇంతకంటే మనిషికింకేం కావాలి?

ఒక్కో ఊళ్లో నెల రోజులన్నా తమ క్యాంపు ఉండేది. రోజు యక్షగానాల ప్రదర్శన జరిగేది. ఆ రోజుల్లో యక్షగానాలనే బాగోతాలనేవారు. ఊళ్లో చివరి ప్రదర్శన... మహిషాసుర మర్దనియైన దుర్గమ్మలాగా ఎల్లమ్మ వేషం ప్రదర్శన ఉండేది. ఎల్లమ్మ వేషం అతి గాంభీర్యంగా, చిన్న పిల్లలు చూస్తే ఝడుసుకునేలా ఉండేది. డప్పుల చప్పుళ్లతో ఎల్లమ్మ పరుగులుదీస్తూ ఊరంతా తిరిగేది. దాని కారణంగా ఊళ్లోని దుష్టశక్తులు, కరువుకాటకాలు పారిపోతాయనేవారు పెద్దలు. పెద్దల మాట చద్దిమూటలా పంజేసేది. బావులు, కుంటలు, చెరువుల నిండా నీరు, పొలాలు - చేల నిండా పచ్చదనం, వానాకాలంలో పుష్కలంగా వర్షాలు... ఎటు చూసిన లక్ష్మీదేవి కళకళలాడుతున్నట్టు కనబడేది. ఏ కాలంలో జరగాల్సిన ప్రకృతి పనులు ఆ కాలంలో జరిగేవి. ఫళ్లు- ఫలాలు... సహజ సంపదలు పుష్కలంగా దొరికేవి. అంత మంచి కాలం, ఆ రామరాజ్యం... మళ్లీ వస్తుందా!?

తనకు ఇరవయ్యేళ్ళ వయసులో మేనమరదలు సుశీలతో పెళ్లైంది. అప్పటికే సుశీల పెద్దబాలశిక్ష చదువుకుంది. బాగోతం ప్రదర్శనప్పుడు అందరి ఆడవాళ్లలాగే తానూ పరదా వెనక నుండి వంతలు పాడేది. హార్మోనియం వాయించేది.

భక్తులను పరీక్షలకు గురిచెయ్యడం భగవంతునికి సరదానేమో కాని సంతానం కోసం సుశీల చెయ్యని పూజలు లేవు, మొక్కని దేవుడు లేడు.

''నాకింక పిల్లలు పుట్టరేమో. నువ్వు ఇంకో పెండ్లి జేసుకోవాలె. మన చేతులల్ల చంటి పిల్ల నవ్వులు నవ్వాలె'' అందో సారి ఆవేదనతో. తనక్కోపమొచ్చింది.

''అట్లనకు సుశీలా? రెండో పెళ్లానిగ్గూడా పిల్లలు పుట్టక పోతే మూడో పెండ్లి చేసుకోవాల్నా? అయినా నీకన్యాయం చేస్తే నేను పురుగులవడిపోతా. ఇంకెప్పుడూ ఇసొంటి మాట లనొద్దు'' అని మందలించాక తన మనసు శాంతించింది.

పై వాడి పంచలో ఆస్యముందిగాని అంధకారం లేదు - అన్న సామెత నిజమైంది. ముప్పయ్యేళ్ళ వయసులో సుశీల నెల దప్పింది. ముజ్జగాలు గెలిచినట్టు మురిసిపోయింది.

కోరుకున్న వరం దొరగ్గానే సరిపోదు. దాని ఫలితాన్నను భవించే అదృష్టంగూడా ఉండాలి గదా!... సుశీలకు కాన్పు కష్టమైంది. ఓ రోజంతా ప్రసవ వేదనతో తల్లడిల్లింది. పురుడు పోసేందుకొచ్చిన మంగలి నర్సమ్మ శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. పండంటి కొడుకును నర్సమ్మ చేతికందించి సుశీల పై లోకానికెళ్లిపోయింది. పెళ్లి ప్రమాణాలప్పుడు కష్టసుఖాల్లో కలిసుంటానన్న సుశీల తన దారి తాను చూసుకొంది. తన ఆశల్ని ఆమె ఆవేదనలను భూమ్మీద వదిలేసిన వైనం తన గుండెల్లో చిచ్చుబెట్టింది. తల్లిని చంపిన కొడుకని... పస్సి కూననెవ్వరూ తిట్టొదని అందరితో చెప్పాల్సి వచ్చింది. శివున్నాజ్ఞలేనిది చీమైనా కుట్టదుగదా''- పసికూన పేరు గంగాధర్.

యక్షగానాలు, బాగోతాలను ఊరూరా ప్రదర్శించే చిందు మాదిగలు చిదానంద స్వరూపులనేవారు. ఆరోజుల్లో సంచార జీవితములో సదాచారమే ధ్యేయము. ముఠాలుగా ఊళ్లు తిరిగినా దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మాచరణ ప్రచారము ఆశయము. అందుకే అందరి మన్ననలందుకునేవారు.

ఏ ఊళ్లో ఉంటే ఆ ఊరి బడికెళ్లేవాడు గంగాధర్. చిన్నప్పుడు లవ, కుశ, లోహితాస్యుడు లాంటి పిల్లల పాత్రలు పోషించేవాడు. కుల విద్య- కళ విద్యతోపాటు సాధారణ విద్య... ఎటూ అందకుండా అయిపోయింది గంగాధర్‌కు. త్రికరణ శుద్ధిగా చిందు బాగోతాలకే అంకితమైన తన నట నాచాతుర్యం నలభయ్యేళ్ల వయసులో ఇరవయ్యేళ్లుగా చూపించేది. ''మేకప్ మీద నువ్వు నలకూబరునోలె కన్పిస్త''వని అనే వారెందరో. అందుకేనేమో తనకంటే సగం వయసున్న, లలిత పెద్ద కులస్తురాలుననే సంగతి మరిచి తనవెంట పడింది. తన వాళ్లందర్నీ ఎదిరించి ఆ ఊరి గుడిలోనే తనతో మూడుముళ్లు వేయించుకుంది.

సుశీల మనోఫలకమ్మీంచి తొలగిపోలేదనుకుంటున్న సమయములో లలిత వయసు మిసమిసలు, వగలసెగలు తన గుండెల్లో గుసగుసలు రేపినై. తల్లిలేని గంగాధర్‌కో తల్లి దొరికిందనే తృప్తిగూడా ప్రాణవాయువులా పంజేసింది.

లలిత ఏడో తరగతి పాసైందట. యక్షగానాలను కంఠో పాఠం చేసుకుంది. కొద్దిరోజుల్లోనే తమలో కలిసిపోయింది. స్త్రీ పాత్రలు పోషిస్తూ తన నాట్య విలాసంతో ప్రేక్షకులకు పిచ్చెక్కించేది. అప్పుడప్పుడే రంగ స్థల కళలను తన ఝంఝామారుతంతో మాయం చేయగల సినిమా... బలం పుంజుకుంటోంది. సినిమా డాన్సుల్ని యక్షగానాల్లో ప్రదర్శించడమో ఆకర్షణగా మారింది. దానికోసం దగ్గరున్న పట్నం వెళ్లి తామంతా సినిమాలు చూసొచ్చేవారు.

నిజామాబాదు దగ్గర ఓ పల్లెటూళ్లో ఉన్న రోజులవి. లలిత ''నేను సినిమాల ఏసమేస్తే బాగుంటదిగదా'' అందో సారి. తనకు నవ్వొచ్చింది.

''సిన్మా అంటే మాటలా, మజాకా? ఉట్టికెగుల లేనమ్మ స్వర్గానికెగురుతాననదట. అసొంటి పిచ్చి మాటలనొద్దు'' అన్న తన మాటల్ని తేలిగ్గా తీసిపారేసినట్టుంది. నిజామాబాదు నుంచి తమ బాగోతాన్ని చాలాసార్లు చూసేందుకొచ్చిన ఓ యువకుడితో లేచిపోయింది. సినిమాల్లో వేషాలిప్పిస్తానని పిలగాడు ఆశపెట్టాడని పుకార్లు గుప్పుమన్నై. నలుగురు నాల్గురకాలు దెప్పుతూంటే అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలన్పించింది. లలితకోసం తన వాళ్లంతా నిజామాబాదు టౌన్లో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతుకుతూంటే గంగాధర్‌ను ఒళ్లోకి తీసుకుని బోర్‌మని ఏడ్వాలన్పించింది.



తెలియక దారిదప్పిన మనిషిని వెతికి పట్టుకోవచ్చు కాని, తెలిసి ప్రియునితో లేచిపోయిన వైసుపిల్లను పట్టుకోవడం సాధ్యమా? లలిత దొరక లేదు.

తమ ముఠాలో పెద్దమనిషి నారాయణతాత పక్కన కూచుంటే- లోలోపలి దుఃఖం ఉప్పెనలాగా పొంగుకొచ్చింది. గొల్లుమని ఏడుస్తుంటే నారాయణ తాత వీపు నిమిరాడు. తుండు గుడ్డతో కళ్లు తుడిచాడు.

''ఒరేయ్ సీనూ! లలితను నువ్వు కావాలని కోరలేదు. ఆ నడుమంత్రపుదే నీ వెంటబడ్డది. జరిగిందానికి బాధపడి లాభం లేదురా. ఋణానుబంధ రూపేణా, పసుపత్ని సుతాలయా అన్నదిరా భగవద్గీత. భార్యైనా, పశువైనా, కడుపున పుట్టిన పిల్లలైనా గత జన్మల ఋణం తీరేదాకా మన తోని ఉండి అటెన్క మాయమైపోతరు బిడ్డా...'' అంటూ చాలా సముదాయించాడు. అది తన వెన్నుపూసకు వెన్న రాసింది.

వెంటనే తమ క్యాంపు మెదకు జిల్లాకు మారింది.

కాలం కాలనాగులా కాటేస్తుంటూపోతుంటే రానురాను పరిస్థితుల్లో మార్పులొచ్చినై. ఐదారేళ్ల క్రితం చిందు బాగోత మాడుమని తమ వెంట పడేవారు. సినిమాలు, సురభి నాటకాలు పట్టణాల్లోంచి పల్లెటూళ్లకు చొచ్చుకొస్తుంటే తామే ఊరి పెద్దల్ని బతిమాలాల్సి వచ్చింది. కొందరైతే నువ్వు తూనే, ముప్పై రూపాయలిచ్చి మీ చిందు బాగోతం ఆడించే బదులు మూడు రూపాయల ఖర్చుతోని పట్నంబొయ్యి సినిమా చూసి రావచ్చుగదా శ్రీనివాసూ!'' అని మొహమ్మీదే అనేస్తుంటే ప్రాణం విలవిల్లాడేది. రోషం పొడుచుకొచ్చేది కాని ఏం లాభం? పేద కళాకారుని కోపం పెదవులకే చేటు.

సినిమా అంటే సంగీతం, సాహిత్యం, నటన, సాంకేతిక రంగాలలో ఆరితేరిన వారి ఉమ్మడి కృషి ఫలితం. లక్షలు, కోట్ల రూపాయల పెట్టుబడితో తయారైన సినిమా ముందు చిందు బాగోతం ఏనుగును చూసిన ఎలుక పిల్లలాగై పోయింది. ''కళ విద్యలెన్ని నేర్చిన, కుల విద్యలసాటి రాదు, గువ్వల చెన్నా...'' పద్యంలోని నిజం నేతి బీరకాయలోని నెయ్యిలాగైపోయింది.

చిందు బాగోతాల చిందులాటల్ల గంగాధర్ చదువు బలైపోయింది. ఒక ఊళ్లో గూడా నిలకడ లేనందున వానాకాలం చదువైపోయింది.

ఇద్దరు పెళ్లాలవల్ల తనకింత కష్టమొచ్చిందనుకుంటే- ఆ పరమశివునికీ ఇద్దరు భార్యలేగదా. ఆయనగ్గూడా తిరిపెమంటే తీపే గదా! మరిప్పుడా సర్వేశ్వరుడే తననాదుకోవాలి...

''తాతా... ఓ తాతా!'' మనవడు బాలరాజు వెనక నుండి భుజాల మీద చేతులేసి కుదిపాడు. ''గా చెట్టుకొమ్మల్ని గప్పుట్నుంచి జూత్తున్న వెందుకు తాతా? ఇగో ఈమె నీకోసం వచ్చింది. గిటుజూడు తాతా!'' బుల్లి చేతుల్తో గదవను ఇటు తిప్పాడు. ఎదురుగా నడి వయసు ఆడ మనిషి...

''ఈమె ఎవరబ్బా? ఎక్కణ్ణో చూసినట్టుంది.'' శ్రీనివాసు తలగోక్కుంటూ ఆమెను కిందినుంచి మీద్దాకా చూస్తున్నాడు. ఏదన్నా విషయం గుర్తుకు రానప్పుడు తలగోక్కుంటే తలపుల తలుపులు తెరుచుకుంటాయట.

''ఎక్కడ చూసినా నిన్ను? నువ్వెవలమ్మా'' అడుగుతూంటే మంచమ్మీదున్న కాళ్లు కిందికి వేళ్లాడినై. నుదురు ముడతల మయమైంది. వేప కొమ్మల్లోంచి జారుకొచ్చిన ముసలి సూర్యకిరణాలు ఆమె ఆకారాన్ని చూపిస్తున్నాయి. రెమ్మలతో చెమ్మచెక్కలాడ్తున్న పిల్లగాలి ఆమె చెంపల మీది ముంగురుల్ని లయబద్ధంగా కదిలిస్తున్నాయి. బంగళా దొరసానిలా బతికిన భిక్షగత్తెలాగుంది. పిట్ట పిల్ల నోరులా తెరుచుకున్నాయి పెదాలు...

''నేను... నేనూ... '' మాట పాడుబడ్డ బావిలోంచి వస్తున్నట్టుంది.

'నువ్వూ... నువ్వు ...'' శ్రీనివాసు జ్ఞాపకాల చిందుల్లో మెరిసిన ఆకారం కళ్లల్లో మెరిసింది. ''నువ్వూ... లలితవు గదా!'' అవ్యక్తానందం.

''అవును... నేను లలితనే'' కుక్కిమంచమ్మీద పక్కన కూచుంది. ''నీ పెళ్లాన్నయ్యా.'' బోర్‌మంది. గుండెల్లోంచి ఎగదన్నుకొస్తున్న బాధ నణుచుకోలేక శ్రీనివాసు గుండెల మీద ఒరిగిపోయింది.

''తప్పైపోయిందయ్యా. నిన్ను మోసం జేసిన్నయ్యా'' నెత్తి కొట్టుకుంది. ''పోరగాండ్లు ఆడుకునే రబ్బరు చెండులెక్క ఐపోయిందయ్యా నా బతుకూ...'' వెక్కి వెక్కి ఏడుస్తోంది.

కష్టాలను, కన్నీళ్లను స్థితప్రజ్ఞత మాటున దాచేసుకుని కాటికాపలా కాస్తున్న సత్య హరిశ్చంద్రునికి, కట్టుకున్న భార్య పరాధీనగా, ఆమె చేతిలో కన్నకొడుకు లోహితాస్యుని శవం కనిపించినట్టు- ఏమనాలో, ఏం చెయ్యాలో... శ్రీనివాసుకు అయోమయంగా ఉంది. ఉబికొస్తున్న ఉద్వేగం... కళ్లల్లో ఆశ్చర్యం...

''లలితా... ల...లి...తా!'' లలిత పట్ల పెనవేసుకున్న అసహ్యాన్ని అమాంతం మింగేసిన ఆవేదన పొత్తికడుపులోంచి ఒత్తుకొస్తోంది. భుజాలు పట్టి లేపి కూచోబెట్టాడు. ఒకరి ముఖాలొకరు చూసుకుంటున్నారు... అదో తన్మయత్వం.

''ఏయ్! ఎవలూ... నువ్వెవలివే?'' చేతులు తిప్పుతూ పరుగెత్తుకొచ్చింది కమల.

''కమలా! ఈమె లలిత. నీ అత్తనమ్మా'' భుజమ్మీది తుండుగుడ్డతో కళ్లద్దుకున్నాడు. నెత్తిమీద పిడుగు పడ్డట్లైంది కమలకు. ముద్దబంతి లాగున్న మొహం అసహ్యాన్ని పులుముకుని ముళ్లకంపలాగైంది. కొంగును కసిగా నడుముకు చుట్టుకుంది. కోపం, ఆవేశం పోటీలు పడి తోసుకొస్తున్నై.


'ఆనాడు లేదు, ఈనాడు లేదు. నడుమ నాగెల్లినాడు డోలు గొట్టుమన్నట్టు... మొగడు గిప్పుడు యాదికొచ్చిండా? ఛూ... మా మామ బంగ్లాలు కట్టిండని బరిదెగించి వచ్చినవా? ధనరాశులు కూడవెట్టిండని దొబ్బున పోదామని వచ్చినవా? ఇన్నేండ్లు ఎవన్తోని సంసారం జేసినవో... ఇక్కడికెందుకొచ్చినవే కాముని భూతం?'' తిట్ల పురాణం విప్పి కాండ్రించి ఉమ్మేసింది.

లోకం పోకడ రంగులు దెలియని బాలరాజు అందరి మొహాల్ని మార్చి మార్చి చూస్తున్నాడు. విషయమేమీ అర్థంగాక హోంవర్కు కాపీలను స్కూలు బ్యాగులోకి తోస్తున్నాడు. (మిగతా 19వ పేజీలో)

# సైన్స్ టిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## తేనె పట్టులో గదులకు షడ్భుజి రూపం ఎందుకు?



తేనెటీగలు నిర్మించే తేనె పట్టులోని గదులన్నీ షడ్భుజాకారంలో నిర్మిస్తాయి. ఇలా నిర్మించడంవల్ల ఇచ్చిన ప్రదేశంలో గరిష్టంగా తేనెను నిల్వ చేయగల్గుతాయి. ఆపైన ఈ నిర్మాణానికి మంచి గట్టిదనం ఉంటుంది. అంటే నిల్వచేసిన తేనె బరువుకు గది బీటలు తీసి తేనె బయటకు కారిపోదు.

ఇచ్చిన వైశాల్యంలో షడ్భుజికి సమ బాహు త్రిభుజాకారం కన్నా, చదరంకన్నా కూడా ఎక్కువ పదార్థం నిల్వచేయగల సామర్థ్యం ఉంటుంది. అంటే షడ్భుజికి గరిష్ట ప్రదేశం నిల్వకు అనుకూలంగా ఉంటుంది.

తేనె పట్టులోని గదులలో గరిష్ట పరిమాణంలో తేనె నిల్వ చేసుకోదలచిన తేనెటీగలు గదులను షడ్భుజాకారంలో నిర్మించుకుంటాయి. ఈ గదులను చాలా పటిష్టంగా నిర్మిస్తాయి. ఈ గదులు వాటిలో నిల్వ ఉంచిన మైనం, తేనెల బరువులను భరించగల్గాలి.

కూలి తేనె టీగలు పువ్వుల మీద వాలతాయి. వాటి తొండాలతో పువ్వులలోని మకరందాన్ని పీల్చుకుని కడుపు నింపుకుంటాయి. తొండాన్ని పువ్వులోకి చొప్పించినపుడు దాని తొండానికి పువ్వులోని పుప్పొడి అంటుకుంటుంది.

కొంత పుప్పొడి మకరందంతో కలుస్తుంది. మరికొంత తేనెటీగ శరీరానికి అంటుకుంటుంది. ఈ తేనెటీగ మరొక పుష్పం మీద వాలినపుడు దాని శరీరం మీద గల పుప్పొడి కొంత ఆ పువ్వుకు రవాణా అవుతుంది.

మకరందంతో కడుపు నింపుకున్న తేనెటీగ తేనె పట్టు వున్న ప్రాంతానికి వెళ్ళి అచట నివాసమున్న తేనెటీగకు తాను పీల్చుకున్న మకరందాన్ని అందిస్తుంది. మకరందాన్ని స్వీకరించిన తేనెటీగ తన లాలాజలంతో, దానిలో ఊరే జీర్ణ రసాలతో ఈ మకరందాన్ని మిశ్రమం చేస్తుంది.

తేనెటీగలోని జీర్ణ రసాలలో ఉండే ఎంజైమ్‌లు మకరందంలో ఉండే సంశ్లిష్ట చక్కెరలను గ్లూకోజ్ మరియు ఫ్రక్టోజ్‌లుగా విడగొడతాయి. ఈ నివాస తేనెటీగ మకరందంలో వున్న నీటిని పోగొట్టే విధంగా దానిని ఇగురింప జేస్తుంది.

తేనె పట్టులో కొంతవరకు రూపాంతరం చెందిన మకరందాన్ని తేనెటీగ నిల్వ చేస్తుంది. ఈ రూపాంతరం చెందిన మకరందానికి నిరంతరం గాలి తగిలేటట్లు తేనె పట్టుమీద నివాసం ఉండే ఇతర తేనెటీగలు గాలి విసురుతాయి.

ఈ గాలికి రూపాంతరం చెంది వున్న మకరందంలోని మిగిలిన నీరు ఆవిరి అయిపోయి చిక్కని తేనెగా మారిపోతుంది. తేనెటీగ మకరందం పీల్చినది మొదలు అది చిక్కని తేనెగా మారడానికి కనీసం మూడురోజులు పడుతుంది. తేనెటీగ సెకనుకు తన రెక్కలను మూడువందల నుండి నాల్గువందలసార్లు వరకు ఆడిస్తుంది. రెక్కలను ఇలా కంపించడంవల్ల తేనెటీగ నుండి ఝుంకార ధ్వని ఉత్పత్తి అవుతుంది. ★

**తేనె పట్టులోని గదులన్నీ షడ్భుజాకారంలో నిర్మిస్తాయి. ఇలా నిర్మించడంవల్ల ఇచ్చిన ప్రదేశంలో గరిష్టంగా తేనెను నిల్వ చేయగల్గుతాయి. ఆపైన ఈ నిర్మాణానికి మంచి గట్టిదనం ఉంటుంది. అంటే నిల్వచేసిన తేనె బరువుకు గది బీటలు తీసి తేనె బయటకు కారిపోదు.**

---

(9వ పేజీ తరువాయి)

"లలితా ఈ కమల మన కోడలు, గంగాధరం పెండ్లాం. అగో వాడు బాలరాజు... మన మనవడు... " శ్రీనివాసు తమకం.

"ఏయ్ ముసలయ్యా!" గయ్యమంది కమల. సిగ్గులేదా. ఎప్పుడో ఎవన్తోనో లేచిపోయింది మల్లా నీ పెండ్లామైతదా? ముసలి తనానికి కుసుమగుడాలన్నట్టు దాంతోని మల్లా మంచమెక్కి పిల్లల్ని కంటవా? కాటికి కాల్లు జాపినవు... ఎందుకీ పిచ్చి?" ఝాడించేసింది.

ఘోర నేరంచేసి పట్టుబడినట్టు శ్రీనివాసు తల నేలకు వాలింది. జీవం హరించుకుపోతున్న శక్తినంతా నరాల ద్వారా గొంతులోకి తెచ్చుకుంది. ప్రాణాలు కళ్లల్లోకొచ్చినై.

"కమలా! నాది తప్పే. నేను... ప్పా... పాపాత్మురాలినే!! కండరాల్లో బలం లేని చేతుల్ని జోడించింది. లేవబోయి కూలబడింది.

"తప్పొ ఒప్పుల బాగోతమిప్పుడేమీ వద్దుగాని నీ దారిన నువ్వెళ్లిపో." కనుగుడ్లు ఎర్ర గచ్చకాయల్లా కదుల్తున్నె. "నంగనాచి తుంగబుర్ర... నువు లెవ్!"

"పోతాను కదు... లా!" ఆయాసంతో గుండెలెగసి పడుతున్నె. ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో బలం తగ్గిపోతోంది. కళ్లు పాలిపోతున్నె. "ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది. నా... పాపాలకు... ఫలితం... నాకు ఎయిడ్స్ ముదిరిపోయిందటమ్మా" మాటలు అతి ప్రయత్నమ్మీద బయటికొస్తున్నె. "కోర వయసుల దారిదప్పి ఊరుకులాడిన. నాకీ గతి పడ్తుందని తెల్వలేదమ్మా..." ఊపిరి తిత్తులు కమ్మరి కొలిమి తిత్తిలా ఎగురుతున్నె.

ఈ దరిద్రం ముండ నా ఇంటి మీద పడిపోతుందేమో... కమలకు పిచ్చెక్కినట్లైంది. "ఏయ్ లలితత్తా! ఇది చిందు బాగోతం కాదు. నీ నటన చాలు. ఎవన్తోని లేచిపోయినవో దాంతోనే ఉండుపో." ఉగ్రరూపం ఉరిమింది.

దినమంతా పంజేసి స్కూల్లో అలిసి, అప్పుడే వచ్చిన గంగాధర్ కాళ్లకు బ్రేకులు పడినై. లోలోపల ఆందోళన. "ఏంది కమలా? ఇదంతా ఏందటా?" తండ్రి ముందుకొచ్చి అడిగాడు.

మసక చీకటి పరదాలు దించుతోంది. శ్రీనివాసు నరాల్లో సునామీ అలలు ఎగిరి పడుతున్నె. "శ్రీనూ! ఈమె నీ చిన్నమ్మరా... గుర్తుకుందా?" కొడుకు కళ్లల్లోకి చూసాడు. శ్రీనివాసుకు కరెంట్ షాక్ కొట్టినట్లైంది. నోరు బార్లా తెరుచుకుంది.

"ఓర్నియవ్వ... నా సవతి తల్లిగదా!" ఆసాంతం చూస్తున్నాడు లలితను. "థూ... నీ బతుకు చెడా!" ఉమ్మేశాడు. ఇంటిముందున్న వీధి లైటు వెలిగింది. వెలుతురు కిరణాలు చెట్టుకింద పరుచుకున్నాయి.

ఓ కొంటె గాలి కెరటం జోరుగా వీచింది. వేపచెట్టు చిటారు కొమ్మల్లోంచి పండుటాకు రాలి నేలమీద పడింది.

"పో...తున్నా... బా...బూ...!" శుష్కించిన లలిత శరీరం శ్రీనివాసు ఒడిలో వాలిపోయింది. కనుగుడ్లు నిలబడిపోయినై.

మూడు దశాబ్దాల క్రితం చిదానందమూర్తిగా చిందులేసి జానపదుల హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్న, చిందుమాదిగ శ్రీనివాసు నవనాడులు స్తంభించిపోయినై.

"అ... య్యో...ల...లి...తా!" నడుము విరిగియినట్టు ముందుకు, లలిత శరీరమ్మీద వాలాడు. మొహాలు కలుసుకున్నె. వేప చెట్టు విస్తుబోయింది.

గాలి స్తంభించిపోయింది. ★